క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు బుధవారం ఎమ్మెల్యే సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ట్రెజరీ ద్వారా వేతనాలను చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని వారు విన్నవించారు. ఆపరేటర్ల సంఘం నాయకులు శంకర్, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాచారెడ్డి(కామారెడ్డి): బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సివంది సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికులకు నెలలో 26 రోజులు పని కల్పించాలని అన్నారు. కానీ యాజమాన్యాలు 10 రోజులైనా పని కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

'ఉపాధి' పనులపై సమీక్ష



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరితహారం, క్రీడా ప్రాంగణాలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, కూలీలకు పని కల్పించడం, పనుల్లో పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జులై మాసంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటడానికి సిద్ధం చేయాలని సూచించారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల అందజేత



బాన్సువాడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, పిట్లం మండలాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లను మండల విద్యాధికారులు నాగేశ్వర్‌రావు, దేవిసింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డిక్టోరియల్ ఆఫీసర్ వెంకటరమణరావు మాట్లాడుతూ.. జిల్లాలో 22 మండలాలకు 807 ట్యాబ్‌లు అందజేశామని తెలిపారు. 150 మంది కంటే ఎక్కువగా ఉన్న పాఠశాలలకు రెండు ట్యాబ్‌లు అందజేశామని, విద్యార్థుల పూర్తి వివరాలు, పాఠ్యాంశాలపై విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టుకు సంబంధించి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు.

ఆర్థిక సాయం

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన శీలం స్వామి(35) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. అంత్యక్రియల కోసం షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామస్వామిగౌడ్, బాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

'ముదిరాజ్' భవన నిర్మాణ పనులకు భూమి పూజ



ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ..భవన నిర్మాణం నాణ్యతతో చేయాలని నిర్వాహకులకు సూచించారు. రూ.10లక్షలతో భవనాన్ని నిర్మించనున్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సంఘం నాయకులు రాములు, నారాయణ, తదితరులున్నారు.

మంకీ ఫుడ్ కోర్టు కబ్జాకు యత్నం

- సర్పంచ్ కుమారుడితో పాటు మరో వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు గ్రామస్తుల ఆరోపణ
- కారకులపై చర్యలు తీసుకోవాలని తండా ప్రజల డిమాండ్



మంకీ ఫుడ్ కోర్టులో స్తంభాలను ధ్వంసం చేసి చదును చేసిన భూమి

రాజంపేట: ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సి బాధ్యత ప్రజాప్రతినిధులది. కానీ ఏకంగా సర్పంచ్ కుమారుడే గ్రామానికి చెందిన మంకీ ఫుడ్ కోర్టును ధ్వంసం చేసిన ఘటన బుధవారం రాజంపేట మండలం శేర్‌శంకర్‌తండాలో చోటుచేసుకుంది. వివరాలు.. తెలంగాణాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా 4 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మార్వో కేటాయించిన స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సుమారు రూ.2.50 వేలతో మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర క్రితం అప్పటి సర్పంచ్ ఫరంగస్ చనిపోవడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న ముద్రిచ్ప శంకర్ నాయక్‌ను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించింది. ఏడాది కాలంగా శంకర్ నాయక్ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. దీన్ని అదునుగా చేసుకున్న ఆయన కుమారుడు ముద్రిచ్ప రమేష్ పెత్తనం చలాయిస్తూ తండాలో ఆగడాలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంబంధిత అధికారులు నీటి దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తుండగా అలంకరించిన తోరణాలు, ఎమ్మెల్యే సురేందర్ ఫ్లెక్సీలు చించేసి వీరంగం సృష్టించాడు. మంగళవారం రాత్రి సర్పంచ్ కుమారుడు మరో వ్యక్తితో కలిసి మంకీఫుడ్ కోర్టును పూర్తిగా ధ్వంసం చేసి భూమిని చదును చేసి కంచెను, స్తంభాలను దొంగిలించినట్లు తండా ప్రజలు తెలిపారు. బుధవారం గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న జీపీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మంకీఫుడ్ కోర్టు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించారు. దీంతో ఆమె మంకీ ఫుడ్ కోర్టు ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజంపేట పోలీసు స్టేషన్‌లో వార్డు సభ్యులు, తండా ప్రజలతో కలిసి ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పైపులైన్ల లీకేజీలను అరికడుతూ డయేరియా, అతిసారా వ్యాధులు రాకుండా చూసుకోవాలని, అధికారులను ఆమె ఆదేశించారు. ఏఈవోలు గ్రామాల్లో తిరుగుతూ విత్తనాల ఎంపిక, పంటల సాగుపైన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసరా పింఛన్లు, ఇళ్ల మంజూరు, బీసీ రుణాలకు వచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తూ అర్హులందరికి పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సీడీసీ అధ్యక్షుడు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గైని విఠల్, వైస్ ఎంపీపీ మనోహర్, సొసైటీల చైర్మన్లు నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు



బాన్సువాడలో నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



జిల్లా గ్రంథాలయ సంస్థలో.. చైర్మన్ పి.రాజేశ్వర్

బాన్సువాడ రూరల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మేధోసంపన్నుడు, బహుభాషా కోవిదుడని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరి గంగాధర్ కొనియాడారు. ఆర్థిక సంస్కరణలతో పరిపాలనదక్షుడు అనిపించుకున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం పీవీ జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులు రామ్ భాస్కర్, శ్రీనివాస్, వెంకట్, కృష్ణ, అంబయ్య, బాలరాజు, శ్రీదేవి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలో..

కామారెడ్డి అర్బన్: దేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న దశలో సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేసి ప్రగతి బాటలు వేసిన అపర చాణక్యుడు, తెలంగాణ ముద్దుబిడ్డ దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా గ్రంథాలయ సంస్థలో నివాళి అర్పించారు.

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పింఛన్‌దారుల జేఏసీ నేతలు

కామారెడ్డి అర్బన్: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బుధవారం తెలంగాణ ప్రభుత్వ పింఛన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పీఆర్‌సీ, డీఏ బకాయి ఒకేసారి విడుదల, నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా కన్వీనర్ హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర సలహాదారుడు జి.లచ్చయ్య, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ కావేటి వేణుగోపాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సమావేశాలను విజయవంతం చేయండి



జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

కామారెడ్డి టౌన్: జులై 2, 3 తేదీల్లో కామారెడ్డిలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర కమిటీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. అల్తాఫ్, అవినాష్, సచిన్, నగేష్, రంజిత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా విఠలేశ్వరుడి ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో విఠలేశ్వరుడి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆశాఢమాసంలోని దశమి, ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలలో భాగంగా విఠలేశ్వరుడి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు.

బోనాల ఉత్సవాలపై ఆలయ కమిటీ సమావేశం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో బోనాల ఉత్సవాలపై ఆలయ కమిటీ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ముత్యాల పోచమ్మ ఆలయంలో ఆశాఢమాసం చివరి ఆదివారం నిర్వహించే బోనాల పండుగ గురించి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. ఆలయ కమిటి సభ్యులు వినోద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత



రామారెడ్డి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అన్నారు. మద్దికుంటలో బుధవారం సీసీ రోడ్డు పనులను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొమ్మిడి రాంరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడారు. వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఎంపీటీసీ రాజేందర్, ఉప సర్పంచ్ నరేందర్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

- కోరం లేకపోవడమే కారణం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో రఘు వాయిదా వేశారు. సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రాజ్‌దాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షాహెద్ పాష అధికారులతో కలిసి సమావేశపు హాల్‌లోకి వెళ్లారు. 11.30 గంటల వరకు ఎవరూ హాజరుకాకపోవడంతో మండల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. సమావేశం నిర్వహించే తేదీని తర్వాత ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

ఆడపడుచులకు సీఎం కానుక కల్యాణ లక్ష్మి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: ఆడపడుచులకు సీఎం కేసీఆర్ కానుకగా కల్యాణ లక్ష్మి పథకాన్ని అందిస్తున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆడపడుచులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. దీంతో పాటు ఎమ్మెల్యే తనవంతు కానుకగా మహిళలకు చీరలను బహూకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. పుట్టిననాటి నుంచి వివాహం జరిగే వరకు మహిళలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా సాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, కౌన్సిలర్లు రాము, శ్రీనివాస్, తదితరులున్నారు.

మెతుకు వేటలో బాల్యం బందీ



చిత్తు కాగితాలు ఏరుకుంటున్న పిల్లలు

బాన్సువాడ రూరల్: అన్నెం పుణ్యెం ఎరుగని బాలలు వారు. వారిని పోషించలేని నిస్సహాయులు వారి తల్లిదండ్రులు. మెతుకు కరువై బతుకు వేటలో చిత్తుకాగితాలు ఏరుకుంటున్న వీరి బాల్యాన్ని పేదరికం బందీ చేస్తోంది. వేసవి సెలవుల్లో పాఠశాలలు మూతపడటంతో కనీసం మధ్యాహ్న భోజనానికి నోచుకోని ఎందరో నిరుపేద విద్యార్థులు కూటికోసం వివిధ పనుల్లో కుదిరారు. ఇటీవల అధికారులు నిర్వహించిన బడిబాట తూతూ మంత్రంగా సాగడంతో చాలామంది పేదపిల్లలు ఇంకా బడిబాట పట్టలేదు. తాడ్కోల్ శివారులో డబుల్ బెడ్‌రూరం కాలనీ వద్ద చిత్తు కాగితాలు ఏరుకుంటూ చిన్నారులు కనిపించడంతో 'సాక్షి' క్లిక్ మనిపించింది.

బడిబయట పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ సంజీవ్‌కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): బాయంపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు కొన్ని రోజులుగా స్కూల్‌కు వెళ్లడంలేదని తెలుసుకున్న సీఆర్పీ సంజీవ్ కుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామానికి చెందిన అంబెపు స్వర్ణ(8వ తరగతి) పాఠశాలకు, సంధ్య(ఇంటర్) కళాశాలకు వెళ్లకపోవడంతో వారి తల్లిదండ్రులు మైశవ్వ, సాయిలుకు విద్య ప్రాధాన్యత, బాలికలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలు, చదువుకోకపోతే ఎదురయ్యే ఇబ్బందుల గురించి వివరించి ఒప్పించారు. వీరిని శుక్రవారం బడిలో చేర్పించనున్నట్లు సీఆర్పీ తెలిపారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ: బక్రీద్ పండుగ ఏర్పాట్లను బుధవారం బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ముస్లింలు ప్రార్థనలు చేసే ఈద్గా వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు. ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కమిషనర్ రమేష్, మైనార్టీ నాయకులు అలీమొద్దిన్‌బాబా, ముఖీద్ తదితరులున్నారు.

బీజేపీలో చిన్నమల్లారెడ్డి గ్రామస్తుల చేరిక



రమణారెడ్డి సమక్షంలో చేరుతున్న గ్రామస్తులు

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన పలువురు మహిళలు, కొంత మంది యువకులు బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

కామారెడ్డి డిగ్రీ కళాశాల వద్ద బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లు ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ అన్యోన్య

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట పాత జాతీయ రహదారిపై వాహనాల నియంత్రణ కోసం బుధవారం బారికేడ్లను అడిషనల్ ఎస్పీ అన్యోన్య ప్రారంభించారు. కళాశాల ఎదుట రద్దీ దృష్ట్యా ప్రమాదాల నివారణకు బారికేడ్లను ఏర్పాటు చేసినట్టు అడిషనల్ ఎస్పీ అన్నారు. విద్యార్థులు తొందర పడకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ కిష్టయ్య, ఏఆర్ డీఎస్పీ ఉదయ్‌కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం చంద్రకాంత్, అధ్యాపకులు వి శంకర్, ఎన్‌సీసీ అధికారి ఎం రామస్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు



మద్నూర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

మద్నూర్(జుక్కల్): రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే దుకాణదారుల లైసెన్సులు రద్దు చేస్తామని టాస్క్‌ఫోర్స్ ఏవో సుధాకర్ హెచ్చరించారు. డోంగ్లీ, మద్నూర్ మండలాల్లోని ఫర్టిలైజర్, విత్తన దుకాణాలపై బుధవారం టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దుకాణాలపై దాడులు నిర్వహించి స్టాక్ వివరాలు, బిల్లులను తనిఖీ చేశారు. దుకాణదారులు విక్రయించిన ప్రతి దానికి రసీదులు ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఏవో రాజు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ఎన్నికల హామీల ఫ్లెక్సీలు



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల ఫ్లెక్సీలను బుధవారం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలువగానే ప్రజల సంక్షేమం కోసం చేపట్టే పథకాలను ఫ్లెక్సీలలో అచ్చు వేయించి ముందుస్తుగా ప్రచారానికి తెరలేపారు. ఈ ఫ్లెక్సీలను చూసి గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సంక్షిప్తం

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పెద్దదడ్గిలో బుధవారం లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ సర్పంచ్ సాయిలు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, తెలంగాణ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.

దరఖాస్తుల పరిశీలన

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను బుధవారం రాజంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అశోక్, ఎంపీడీవో బాలకిషన్‌లు పరిశీలించారు. మండలంలో మొత్తం 521 మంది బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వీరిలో గతంలో ఏదైనా ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి పొందారా అనే అంశం దిశగా దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు.

65వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 65వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం గ్రామస్తులు దీక్షలో కూర్చుని ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా తమ నిరసనను తెలిపారు. వెంటనే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ఎల్లారెడ్డి: ఫిజియోథెరపి ద్వారా అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపిస్ట్ అరుణ్ అన్నారు. బుధవారం భవిత కార్యాలయంలో ఫిజియోథెరపి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులకు ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలు చేయించాలని సూచించారు. సిబ్బంది శివకుమార్, వెంకటేశం తదితరులున్నారు.

వంద బస్తాల సిమెంట్ విరాళం

రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని ప్రాకార మండపం పనుల కు ప్రముఖ శాస్త్రవేత పైడి ఎల్లారెడ్డి సహకరించారు. తన వంతుగా మండపం నిర్మాణం కో సం వంద బస్తాల సిమెంట్‌ను విరాళంగా ఆలయ సిబ్బందికి బుధవారం అందజేసినట్లు ఆలయ జూనియర్ అసిస్టెంట్ సురేందర్ తెలిపారు.

వర్షంతో రైతుల హర్షం



మద్నూర్(జుక్కల్): వానాకాలం పంటలు విత్తుకునేందుకు సరిపడా వర్షం కురియడంతో రైతులు మురిసిపోతున్నారు. మండలంలో బుధవారం వర్షం కురియడంతో వ్యవసాయ భూములు తడిసి ముద్దయ్యాయని రైతులు సంబురపడుతున్నారు. వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రైతులు విత్తనాలు విత్తుకోవడంలో బిజీగా మారారు.